మరణం లేని జీవి!



న్యూయార్క్: ఈ సృష్టిలో జన్మించిన ప్రతీ జీవికి మరణం తప్పదనేది అందరూ అనే మాట. అయితే, టర్రిటోప్సిస్ డోర్నీ అనే ఒక రకమైన జెల్లీ షిష్ మాత్రం ఇందుకు మినహాయింపు. వయసును రివర్స్ చేసుకొనే అసాధారణ సామర్థ్యం ఈ సముద్ర జీవికి ఉంది. 1883లో ఈ జెల్లీఫిష్‌ను మొదట శాస్త్రవేత్తలు గుర్తించారు. దీనిపై పరిశోధనలు జరపగా ఆశ్చర్యకర విషయాలు వెలుగులోకి వచ్చాయి. సాధారణ పరిస్థితుల్లో ఈ టర్రిటోప్సిస్ డోర్నీ జీవనచక్రం మిగతా జెల్లీఫిష్‌ల మాదిరిగానే ఉంటుంది. లార్వా దశతో మొదలై పాలిప్ దశ(యువ)లోకి, ఆ తర్వాత అడల్ట్ దశలోకి మారుతుంది. అయితే, ఏదైనా దెబ్బ తగిలినప్పుడు, పర్యావరణ ఒత్తిడి కలిగినప్పుడు ఈ జీవి తన జీవనచక్రంలో వెనక్కు వెళ్లగలదు. దీని కణాలను పాలిప్ దశలోకి మార్చుకొని, మళ్లీ అక్కడి నుంచి జీవనచక్రాన్ని ప్రారంభించగలదు. తద్వారా ఇది మళ్లీ యవ్వనంలోకి వెళ్లడంతో పాటు వృద్ధాప్యంతో సంభవించే మరణాన్ని దూరం చేసుకోగలదు. సాధారణంగా 4-5 మిల్లీమీటర్ల వ్యాసంలోనే ఉండే ఈ రకమైన జెల్లీఫిష్‌లను మధ్యధరా సముద్రంలో మొదట గుర్తించగా, ఇప్పుడు అన్ని సముద్రాల్లో కనిపిస్తున్నాయి.

సూక్ష్మక్రిములతో ట్రాకింగ్

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, నవంబర్ 12 (నమస్తే తెలంగాణ): మనం ఎక్కడెక్కడికి వెళ్లామో, ప్రస్తుతం ఏ ప్రాంతంలో ఉన్నామో స్మార్ట్‌ఫోన్‌లోని జీపీఎస్‌ను బట్టి తెలుసుకోవచ్చు. అయితే, ఫోన్ అవసరం లేకుండా మన శరీరం మీద ఉన్న సూక్ష్మక్రిములను బట్టి కూడా మనం ఎక్కడెక్కడికి వెళ్లొచ్చామో చిటికెలో తెలుసుకోవచ్చని స్వీడన్ పరిశోధకులు చెప్తున్నారు. తాము అభివృద్ధి చేసిన మైక్రోబియమ్ జియోగ్రాఫిక్ పాపులేషన్ స్ట్రక్చర్ (ఎంజీపీఎస్) ఏఐ టూల్ సాయంతో ఓ వ్యక్తి ఎక్కడెక్కడికి వెళ్లొచ్చాడన్న విషయాన్ని తెలుసుకోవచ్చని వాళ్లు పేర్కొన్నారు. సదరు వ్యక్తి శరీరం మీద ఉండే బ్యాక్టీరియా, ఫంగీ, ఆర్కే తదితర సూక్ష్మక్రిములను విశ్లేషించి అవి ఏయే ప్రాంతాల్లో ఏయే ఉష్ణోగ్రతల వద్ద ఎలా ప్రవర్తిస్తాయనే దాన్ని ఆధారంగా చేసుకొని తాము ఆ వ్యక్తి లొకేషన్‌ను ట్రాక్ చేయగలమని వెల్లడించారు. ఈ మేరకు 18 దేశాల్లోని 53 నగరాల్లోని 237 మట్టి నమూనాల్లోని అలాగే 131 నీటి వనరుల్లోని సూక్ష్మజీవుల వివరాలను ఈ ఏఐ టూల్‌లో నిక్షిప్తం చేసినట్లు వివరించారు. ఈ వివరాలు 'జీనోమ్ బయాలజీ అండ్ ఎవల్యూషన్' అనే జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

హైస్పీడ్ ఇంటర్నెట్‌తో ఊబకాయం

మెల్‌బోర్న్, నవంబర్ 12: హైస్పీడ్ ఇంటర్నెట్‌కు, ఊబకాయానికి సంబంధం ఉందంటున్నారు ఆస్ట్రేలియాకు చెందిన పరిశోధకులు. అధిక ఇంటర్నెట్ స్పీడ్‌తో ఊబకాయులు పెరుగుతున్నారని వీరు ఒక అధ్యయనంలో గుర్తించారు. మోనాష్ బిజినెస్ స్కూల్‌కు చెందిన పరిశోధకులు పలు సంవత్సరాల హౌజ్‌హోల్డ్, ఇన్‌కం అండ్ లేబర్ డైనమిక్స్ ఇన్ ఆస్ట్రేలియా(హెచ్ఐఎల్‌డీఏ) డాటాను విశ్లేషించి ఈ విషయాన్ని తేల్చారు. 2006 నుంచి 2019 మధ్యకాలంలో హైస్పీడ్ ఇంటర్నెట్ వినియోగం ఆస్ట్రేలియా వ్యాప్తంగా విస్తరించిందని, అదే విధంగా జనంలో నిశ్చల జీవనశైలి కూడా పెరిగిందని పరిశోధకుడు డాక్టర్ క్లాస్ అకెర్‌మాన్ తెలిపారు. అధిక స్పీడ్‌తో ఇంటర్నెట్ అందుబాటులో ఉండటం వల్ల ప్రజలు ఎక్కువ సమయం స్క్రీన్లకు అతుక్కుపోతున్నారని, ఫలితంగా వారిలో డబ్ల్యూహెచ్ఓ సూచించిన మేరకు శారీరక శ్రమ ఉండటం లేదని చెప్పారు. పైగా ఎక్కువ సేపు స్క్రీన్ చూస్తూ ఉండటం వల్ల చిరుతిళ్లు ఎక్కువగా తింటున్నారని, దీంతో వారి కేలరీ ఇన్‌టేక్ పెరుగుతున్నదని తెలిపారు.

ముడా స్కామ్‌లో లోకాయుక్త సోదాలు

ప్లాట్ల కేటాయింపును సీఎం ప్రభావితం చేశారని సామాజిక కార్యకర్త ఆరోపణలు

బెళగావి : కర్ణాటకలో ముడా స్కామ్‌పై దాఖలైన 9 కేసులకు సంబంధించి మంగళవారం 40 చోట్ల లోకాయుక్త దాడులు చేసింది. బెళగావి, హవేరి, దావణగెరె, కలబురగి, మైసూరులోని పలు ప్రాంతాల్లో ఈ సోదాలు జరిగాయి. మరోవైపు ముడా ప్లాట్ల కేటాయింపును సీఎం సిద్ధరామయ్య ప్రభావితం చేశారని సామాజిక కార్యకర్త స్నేహమయి కృష్ణ తీవ్ర ఆరోపణలు చేశారు. సిద్ధరామయ్య భార్య తనకు కేటాయించిన ముడా ప్లాట్ కొనుగోలు ఒప్పంద పత్రానికి రుసుమును చెల్లించలేదని ఆయన ఆరోపించారు. ముడా తహసీల్దారే స్టాంప్ డ్యూటీ చెల్లించారని చెప్పారు. లోకాయుక్త దర్యాప్తు విశ్వసనీయతపై కేంద్ర మంత్రి కుమారస్వామి సందేహం వ్యక్తం చేశారు.

పసుపులో మోతాదుకు మించి సీసం

తాజా అధ్యయనంలో వెల్లడి

న్యూఢిల్లీ: భారత్‌లో వంటలు, శుభకార్యాల్లో విరివిగా ఉపయోగించే పసుపులో 'విషం' ఉన్నదట. భారత్‌తో పాటు నేపాల్, పాకిస్థాన్‌లో అమ్ముతున్న పసుపులో సీసం (లెడ్) అధిక స్థాయిల్లో ఉన్నట్టు ఓ అధ్యయనం పేర్కొన్నది. భారత ఆహార నాణ్యతా, ప్రమాణాల సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) నిర్దేశించిన గరిష్ఠ పరిమితి ప్రకారం గ్రాము పసుపులో లెడ్ మోతాదు 10 మైక్రోగ్రాములు మించకూడదు. కానీ, ఈ అధ్యయనంలో పరిశీలించిన పసుపు శాంపిళ్లలో లెడ్ మోతాదు 1,000 మైక్రోగ్రాముల కంటే అధికంగా ఉన్నట్టు తేలింది. భారత్, నేపాల్, పాకిస్థాన్, శ్రీలంకలోని 23 నగరాల నుంచి సేకరించిన పసుపు శాంపిళ్లను ఈ అధ్యయనంలో విశ్లేషించారు. పాట్నా, గువాహటి, చెన్నై (భారత్), కాఠ్మాండూ (నేపాల్), కరాచీ, ఇస్లామాబాద్, పెషావర్ (పాకిస్థాన్) నగరాల నుంచి సేకరించిన నమూనాల్లో 10 మైక్రోగ్రాముల కంటే అధికంగా లెడ్ ఉన్నట్టు తేలింది. ఫ్రీడమ్ ఎంప్లాయబిలిటీ అకాడమీ, 'ప్యూర్ ఎర్త్'తో కలిసి స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ నిర్వహించిన ఈ అధ్యయన వివరాలు 'సైన్స్ ఆఫ్ ది టోటల్ ఎన్విరాన్‌మెంట్'లో ప్రచురితమయ్యాయి.

నా మెదడును మెషీన్‌తో కంట్రోల్ చేస్తున్నారు!

సుప్రీంను ఆశ్రయించిన ఏపీ ఉపాధ్యాయుడు

పిటిషన్‌ను కొట్టేసిన కోర్టు

న్యూఢిల్లీ, నవంబర్ 12: తన మెదడును కొందరు మెషీన్ ద్వారా నియంత్రిస్తున్నారని, అది పనిచేయకుండా చైతన్యరహితం చేయాలంటూ ఆదేశాలు ఇవ్వాలంటూ ఒక ఉపాధ్యాయుడు దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు కొట్టివేసింది. కొందరు వ్యక్తులు హైదరాబాద్‌లోని సెంట్రల్ ఫోరెన్సిక్ సైంటిఫిక్ ల్యాబొరేటరీ (సీఎఫ్ఎస్ఎల్) నుంచి తీసుకున్న 'మనిషి మెదడును చదివే పరికరం'ను కొనుగోలు చేసి దాని ద్వారా తన మెదడును నియంత్రిస్తున్నారని ఏపీకి చెందిన ఉపాధ్యాయుడొకరు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. దానిని సుప్రీం కోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ (ఎస్ఎస్ఎల్ఎస్సీ)కి దానిని పంపారు. దీంతో పిటిషనర్ దారుడి నుంచి పూర్తి వివరాలు తెలుసుకున్న కమిటీ అతడి మెదడును ఎవరూ యంత్రపరికరం ద్వారా నియంత్రణ చేయడం లేదని నివేదిక ఇవ్వడంతో సుప్రీం కోర్టు అతడి పిటిషన్‌ను కొట్టివేసింది. కాగా, పిటిషనర్ ఇదే అంశంపై ఏపీ హైకోర్టును ఆశ్రయించగా, 2022లో దానిని అసంబద్ధంగా పేర్కొంటూ కొట్టివేశారు.

తొలి దశలో పైచేయి ఎవరిదో?

- నేడు జార్ఖండ్‌లో మొదటి దశ పోలింగ్
- 43 అసెంబ్లీ స్థానాలకు జరగనున్న ఎన్నిక
- వీటిల్లో 20 ఎస్టీ రిజర్వ్‌డ్ నియోజకవర్గాలు
- భారీగా ఆశలు పెట్టుకున్న ఇండియా కూటమి
- పట్టు సాధించేందుకు కమలం ప్రయత్నాలు
- బరిలో చంపయీ సొరేన్ సహా కీలక నేతలు

రాంచి, నవంబర్ 12: జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల మొదటి దశ పోలింగ్ బుధవారం జరగనుంది. రాష్ట్రంలోని మొత్తం 81 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 43 స్థానాలకు తొలి విడతలో ఓటింగ్ జరుగుతుంది. మొదటి దశలో 1.37 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. 683 మంది అభ్యర్థులు బరిలో ఉండగా వీరిలో 609 మంది పురుషులు, 73 మంది మహిళలు, ఒకరు ట్రాన్స్‌జెండర్ ఉన్నారు. ఉదయం 7 గంటల నుంచి కొన్ని స్థానాలకు సాయంత్రం నాలుగు గంటల వరకు, మరికొన్నింట ఐదు గంటల వరకు పోలింగ్ జరగనుంది. మొదటి విడత పోలింగ్ జరిగే స్థానాల్లో ఇప్పటికే ప్రచారపర్వం ముగిసింది.

గిరిపుత్రులు ఎటు వైపో?

తొలి దశ పోలింగ్ జరగనున్న అన్ని స్థానాల్లో ఎన్డీయే, ఇండియా కూటమి మధ్య హోరాహోరీ పోరు నెలకొన్నది. 2019 ఎన్నికల్లో ఈ 43 స్థానాల్లో 25 స్థానాలను జేఎంఎం, కాంగ్రెస్, ఆర్జేడీ కూటమి గెలుచుకోగా, బీజేపీ కేవలం 13 స్థానాలను, స్వతంత్రులు రెండు స్థానాలను, ఎన్సీపీ ఒక్క సీటును, జేవీఎం ఒక్క సీటును దక్కించుకున్నాయి. 43 నియోజకవర్గాల్లో 20 ఎస్టీ రిజర్వ్‌డ్, ఆరు ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానాలు ఉన్నాయి. గత ఎన్నికల్లో వీటిల్లో 18 స్థానాలను కాంగ్రెస్, జేఎంఎం, ఆర్జేడీ కూటమే దక్కించుకోగా, రెండింటిని మాత్రమే బీజేపీ గెలుచుకుంది. ఈసారి కూడా ఎస్టీ రిజర్వ్‌డ్ స్థానాలపై ఇండియా కూటమి భారీగా ఆశలు పెట్టుకున్నది. ముఖ్యమంత్రి హేమంత్ సొరేన్ అరెస్టుపై సానుభూతి కలిసొస్తుందని భావిస్తున్నది. సొరేన్ సైతం ప్రధానంగా ఎస్టీల హక్కులనే ప్రస్తావిస్తూ ప్రచారం చేశారు. బీజేపీ కూడా గిరిజన ఓటర్లను ఆకర్షించేందుకు ప్రయత్నించింది.

బరిలో ఇద్దరు మాజీ సీఎంల భార్యలు

తొలి దశ ఎన్నికల్లో మాజీ ముఖ్యమంత్రి చంపయీ సొరేన్‌తో పాటు ఆరుగురు మంత్రులు, పలువురు కీలక నేతలు రంగంలో ఉన్నారు. నెల క్రితం జేఎంఎంను వీడి బీజేపీలో చేరిన చంపయీ సొరేన్ మరోసారి సరైకెల్లా నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు. 1991 నుంచి ఇక్కడ ఆయన ఆరుసార్లు విజయం సాధించారు. గత ఎన్నికల్లో ఆయనపై బీజేపీ తరపున పోటీ చేసి ఓడిన గణేశ్ మహలి ఈసారి జేఎంఎం నుంచి పోటీ చేస్తుండటంతో ఈ నియోజవకర్గంలో ఎన్నిక ఆసక్తికరంగా మారింది. రాంచి, జంషేడ్‌పూర్ పశ్చిమ, తూర్పు, జగన్నాథ్‌పూర్, లొహర్దగ, గర్హ్వా, చైబాసా, లతేహర్, పోట్కా వంటి స్థానాలూ కీలకంగా మారాయి. జగన్నాథ్‌పూర్ నుంచి మాజీ ముఖ్యమంత్రి మధు కోడా భార్య గీతా కోడా, పోట్కా నుంచి మరో మాజీ ముఖ్యమంత్రి అర్జున్ ముండా భార్య మీరా బీజేపీ నుంచి పోటీ చేస్తుండటంలో ఈ స్థానాలపై ఆసక్తి నెలకొన్నది.

అబార్షన్ మాత్రలకు అమెరికాలో గిరాకీ

ట్రంప్ అధికారంలోకి రావడం వల్లే..

న్యూయార్క్, నవంబర్ 12: అమెరికాలో అత్యవసర గర్భ విచ్ఛిత్తి మాత్రలకు హఠాత్తుగా డిమాండ్ ఏర్పడింది. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఎన్నికైన 24 గంటల వ్యవధిలో గర్భ విచ్ఛిత్తి మాత్రల ప్రధాన సరఫరాదారులలో ఒకరైన ఎయిడ్ యాక్సెస్‌కు గత 24 గంటల్లో ఈ మాత్రల కోసం 10 వేలకు పైగా విజ్ఞప్తులు వచ్చినట్టు వాషింగ్టన్ పోస్ట్ వెల్లడించింది. ఇది సాధారణంగా ప్రతిరోజు వచ్చే వాటి కన్నా 17 రెట్లు అధికం. ట్రంప్ అధికారంలోకి వస్తే అబార్షన్ హక్కును రద్దు చేస్తారంటూ పెద్దయెత్తున ప్రచారం జరగడంతో వీటికి విపరీతమైన డిమాండ్ పెరిగింది. గర్భం దాల్చని వారు సైతం ఈ గర్భవిచ్ఛిత్తి మాత్రల కోసం ఎగబడటం విశేషం.

అంబేద్కర్ ఇస్లాంలోకి మారడానికి సిద్ధపడ్డారు!

వివాదం రేపిన కర్ణాటక కాంగ్రెస్ నేత వ్యాఖ్యలు

షిగ్గాన్: అంబేద్కర్‌పై కర్ణాటక కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే సయ్యద్ అజీమ్ పీర్ ఖాద్రీ చేసిన వ్యాఖ్యలు వివాదం రేపాయి. ఈ నెల 13న షిగ్గాన్ ఉప ఎన్నిక సందర్భంగా మంగళవారం మాదిగ వర్గం ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఆ రోజుల్లో అంబేద్కర్ ఇస్లాంలో చేరడానికి అంతా సిద్ధమైంది. కానీ చివరికి ఆయన బౌద్ధుడయ్యారు. ఆయన ఇస్లాంలో చేరి ఉంటే ఇవాళ హోం మంత్రి పరమేశ్వర సహా చాలా మంది దళితులు ముస్లింలుగా ఉండేవారు' అని ఖాద్రీ అన్నారు. ఖాద్రీ వ్యాఖ్యలు ఆయన, ఆయన పార్టీ అజ్ఞానాన్ని సూచిస్తున్నదని బీజేపీ విమర్శించింది.

45 రోజుల కాల పరిమితి ఉన్న ఆహార ఉత్పత్తులే డెలివరీ చేయాలి!

ఆన్‌లైన్ డెలివరీ సంస్థలకు ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆదేశం

న్యూఢిల్లీ: డోర్ డెలివరీ చేసే ఆహార ఉత్పత్తుల కనీస కాల పరిమితి(షెల్ఫ్ లైఫ్) విషయంలో స్విగ్గీ, జొమాటో వంటి ఈ-కామర్స్ ఫుడ్ బిజినెస్ ఆపరేటర్లకు ఎఫ్ఎస్ఎస్ఏఐ కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ సంస్థల ప్రతినిధులతో ఫుడ్ సేఫ్టీ ఆండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎఫ్ఎస్ఎస్ఏఐ) సీఈఓ సమావేశమయ్యారు. డెలివరీ చేసే సమయానికి ఆహార ఉత్పత్తుల మొత్తం షెల్ఫ్ లైఫ్‌లో కనీసం 30 శాతం మిగిలి ఉండాలని, లేదా ఎక్స్‌పైరీకి కనీసం 45 రోజులు ఉండాలని ఆదేశించారు. ఆహార సరఫరాదారులకు కచ్చితంగా ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ లేదా రిజిస్ట్రేషన్ ఉండాలని స్పష్టం చేశారు. సురక్షితంగా ఆహారాన్ని డెలివరీ చేయడంపై డెలివరీ సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని చెప్పారు. కల్తీ జరగకుండా నివారించేందుకు ఆహార ఉత్పత్తులు, ఆహారేతర ఉత్పత్తులను వేర్వేరుగా డెలివరీ చేయాలని సూచించారు.

యాపిల్ యూజర్లకు హైరిస్క్ వార్నింగ్

సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేసుకోండని కేంద్రం హెచ్చరికలు

న్యూఢిల్లీ: భారత్‌లో యాపిల్ ఫోన్, ఐప్యాడ్స్, మ్యాక్స్, యాపిల్ వాచ్ వినియోగదార్లను కేంద్రం హెచ్చరించింది. యాపిల్ ఉత్పత్తుల్లో భద్రతా పరమైన లోపాలు తలెత్తే అవకాశముందని, యూజర్ల వ్యక్తిగత సమాచారం గల్లంతయ్యే ముప్పు పొంచి వుందని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంగళవారం సెక్యూరిటీ అలర్ట్ జారీచేసింది. ఈ నేపథ్యంలో 'ద ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్' (సెర్ట్-ఇన్) యాపిల్ యూజర్ల కోసం మార్గదర్శకాల్ని విడుదల చేసింది. ప్రస్తుతం యూజర్లు వాడుతున్న పలు యాపిల్ ఉత్పత్తుల్లోని సాఫ్ట్‌వేర్ ఔట్ డేటెడ్‌గా పేర్కొన్నది. సాఫ్ట్‌వేర్‌ను వెంటనే అప్‌డేట్ చేసుకోవాలని సూచించింది. ప్రస్తుత సాఫ్ట్‌వేర్‌లోని లోపాల్ని ఆసరాగా చేసుకొని సైబర్ మోసగాళ్లు యూజర్ల డాటా దొంగతనం, డాటా తారుమారు, సేవల్ని అడ్డుకోవటం వంటివి జరగవచ్చునని తెలిపింది.

మణిపూర్‌లో ఆరుగురు అదృశ్యం

ఎన్‌కౌంటర్‌తో ఉద్రిక్త పరిస్థితులు

కుకీ ప్రాబల్య ప్రాంతాల్లో బంద్

ఇంఫాల్: మణిపూర్‌లో మళ్లీ ఉద్రిక్తత రాజుకుంటున్నది. సోమవారం జరిగిన భారీ ఎన్‌కౌంటర్ అనంతరం ముగ్గురు మహిళలు, ముగ్గురు చిన్నారులు అదృశ్యమైనట్టు ఐజీపీ ఐకే ముయివా తెలిపారు. ఎన్‌కౌంటర్‌లో మరణించిన మిలిటెంట్లు ముసుగులతో కూడిన దుస్తులు ధరించారని, వారి వద్ద ఆధునిక ఆయుధాలు ఉన్నట్టు తెలిపారు. ముందు జాగ్రత్త చర్యగా జిల్లాలో నిషేధ ఉత్తర్వులు అమలు చేస్తున్నామన్నారు. కాగా, భద్రతా దళాల కాల్పులను నిరసిస్తూ కుకీ ప్రాబల్యమున్న కొండ ప్రాంతాల్లో మంగళవారం ఉదయం నుంచి బంద్ పాటిస్తున్నారు.

40 వేల అద్దె ఫ్లాట్‌కు 5 లక్షల డిపాజిట్

బెంగళూరులో కిరాయిపై చర్చ

బెంగళూరు : కాంగ్రెస్ పాలిత కర్ణాటక రాజధాని బెంగళూరులో ఇండ్ల డిపాజిట్ మొత్తాలు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. తాజాగా అద్దె ఇంటి కోసం వెతుకుతున్న ఓ మహిళ ఇండ్ల యజమానులు భారీ డిపాజిట్లను అడగడంపై తన నైరాశ్యాన్ని సామాజిక మాధ్యమం ఎక్స్ ద్వారా పంచుకున్నారు. ఒక ఇంటి యజమాని రూ.40 వేల అద్దె గల ఫ్లాట్‌కు రూ.5 లక్షలు డిపాజిట్ చేయాలని డిమాండ్ చేసినప్పుడు తాను విస్తుపోయానని ఆమె ఈ పోస్ట్ పెట్టారు. అద్దె ఇంటి కోసం తాను చేస్తున్న పోరాటాన్ని, అద్దెదారులు చెల్లించాల్సిన డిపాజిట్లపై ఉండాల్సిన పరిమితిపై తన వాదనను హర్నిధ్ కౌర్ అనే మహిళ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. దీనిపై కొందరు నెటిజన్లు స్పందిస్తూ.. డిపాజిట్ చెల్లించడం కన్నా ఒక ఇల్లు కొనుక్కోవడం మేలని సూచించారు. ఒక సంవత్సరం మొత్తం అద్దె కన్నా డిపాజిట్ ఎక్కువ అడుగుతున్నారని విమర్శించారు.

హ్యాంగోవర్‌ను దూరం చేసే 'గోల్డ్' జెల్

తయారుచేసిన స్విట్జర్లాండ్ పరిశోధకులు

జురిచ్: మద్యం తాగేటప్పుడు అది ఇచ్చే సంతోషం ఎంతో కానీ తెల్లవారి కలిగే హ్యాంగోవర్ మాత్రం దిమ్మ తిరిగేలా చేస్తుంది. హ్యాంగోవర్‌తో పాటు మద్యపానం వల్ల కలిగే దుష్ప్రభావాలను తగ్గించేందుకు స్విట్జర్లాండ్‌లోని ఈటీహెచ్ యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు కొత్త జెల్‌ను తయారుచేశారు. ఐరన్, గ్లూకోజ్, గోల్డ్‌తో చేసిన మిశ్రమాన్ని వే ప్రొటీన్‌తో తయారుచేసిన జెల్‌తో కలిపి చిన్న పిల్స్‌లా రూపొందించారు. వీటిని మద్యపానం ప్రారంభించే అర గంట ముందు వేసుకోవాలని వీరు తెలిపారు. సాధారణంగా మద్యం తాగగానే కడుపు, ప్రేగుల ద్వారా రక్తంలో కలిసి శరీరమంతా ప్రవహిస్తుంది. మద్యంలోని ఇథనాల్‌ను కాలేయం ఎసిటాల్డిహైడ్‌గా మారుస్తుంది. హ్యాంగోవర్‌కు ఇదే ప్రధాన కారణం. ఆ తర్వాత ఇది ఎసిటిక్ యాసిడ్‌గా మారి మూత్రం ద్వారా శరీరం బయటకు వెళ్లిపోతుంది. ఈ జెల్ వేసుకుంటే మాత్రం మద్యం రక్తంలో కలవకముందే ఎసిటిక్ యాసిడ్‌గా మారిపోతుందని, తద్వారా హ్యాంగోవర్ సమస్య ఉండదని, మద్యపాన దుష్ప్రభావాలు కూడా తగ్గుతాయని పరిశోధకులు తెలిపారు.

మిస్ టీన్ యూనివర్స్‌గా ఒడిశా బ్యూటీ

తృష్ణా రేను వరించిన కిరీటం

భువనేశ్వర్, నవంబర్ 12: భారత్‌కు చెందిన తృష్ణా రే 'మిస్ టీన్ యూనివర్స్-2024' కిరీటాన్ని దక్కించుకున్నారు. ఒడిశాలోని భువనేశ్వర్ కేఐఐటీ యూనివర్సిటీ విద్యార్థిని అయిన తృష్ణా రే దక్షిణాఫ్రికాలోని కింబెర్లీలో నవంబర్ 1 నుంచి 10 వరకు జరిగిన పోటీలలో విజేతగా నిలిచారు. పెరూ, దక్షిణాఫ్రికా, బ్రెజిల్, కెన్యా, పోర్చుగల్, నెదర్లాండ్స్‌కు చెందిన యువతులు ఫైనల్స్‌కు చేరుకోగా, రే వారిని ఓడించి కిరీటాన్ని కైవసం చేసుకున్నారు. పెరూకు చెందిన అన్నే థ్రోసన్, నమీబియాకు చెందిన ప్రెసియస్ ఆండ్రేలు మొదటి, రెండో రన్నరప్‌లుగా నిలిచారు. గత ఏడాది ఏప్రిల్‌లో మిస్ టీన్ యూనివర్స్ ఇండియా విజేతగా నిలిచిన 19 ఏండ్ల రే.. కేఐఐటీ యూనివర్సిటీలో ఫ్యాషన్ టెక్నాలజీ చదువుతున్నది. ఆమె తండ్రి దిలీప్ కుమార్ రే కర్నల్‌గా ఉన్నారు.

మందకొడిగా జేఈఈ మెయిన్ దరఖాస్తు ప్రక్రియ

సాంకేతిక సమస్యలే కారణం!

న్యూఢిల్లీ, నవంబర్ 12: జేఈఈ మెయిన్ సెషన్-1 దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మందకొడిగా కొనసాగుతున్నది. దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమై రెండు వారాలు గడుస్తున్నా కేవలం 5.1 లక్షల దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. గత ఏడాది దరఖాస్తు ప్రక్రియ ప్రారంభించిన మొదటి రెండు వారాల్లో దాదాపు 12.21 లక్షల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఇంత భారీ తేడా ఉండటానికి సాంకేతిక సమస్యలే కారణమని నిపుణులు భావిస్తున్నారు. సాంకేతిక సమస్యల వల్ల రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియ ఆలస్యంగా సాగుతున్నదని చెప్తున్నారు. నవంబర్ 22 వరకే గడువు ఉన్నప్పటికీ ఇంత తక్కువ సంఖ్యలో దరఖాస్తులు రావడం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ఎన్‌టీఏ సమీక్షించి వేగంగా దరఖాస్తు ప్రక్రియలో సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

జనాలపైకి దూసుకెళ్లిన కారు.. 35 మంది మృతి

43 మందికి గాయాలు.. చైనాలో దారుణం

జుహాయ్, నవంబర్ 12: చైనాలోని జుహాయ్ నగరంలో ఓ క్రీడల కేంద్రంపైకి కారు దూసుకెళ్లడంతో 35 మంది మృతి చెందారని, 43 మంది గాయపడ్డారని ఆ దేశ పోలీసులు సోమవారం వెల్లడించారు. ఘటనకు కారకుడైన కారు డ్రైవర్(62)ను అరెస్ట్ చేశామని తెలిపారు. ఇది ఉద్దేశపూర్వకంగా జరిగిన దాడా లేక ప్రమాదవశాత్తు జరిగిందా అనే అంశంపై దర్యాప్తు కొనసాగుతున్నదని తెలిపారు. మంగళవారం జుహాయ్ వాయు ప్రదర్శన ప్రారంభమైందని.. కారు ప్రమాదం సోమవారం రాత్రి జరిగిందని వెల్లడించారు. డ్రైవర్ తన కారుతో చాలా మంది పాదచారులను ఢీ కొట్టాడని తెలిపారు. ప్రమాదం జరిగినప్పుడు దజన్ల మంది క్రీడల కేంద్రంలోని రన్నింగ్ ట్రాక్‌పై పడుకొని ఉన్న దృశ్యాలు ప్రమాద వీడియోల్లో కనిపించాయి. ఈ వార్తకు సంబంధించిన పోస్టింగులపై మీడియా, సోషల్ మీడియాపై అధికారులు సెన్సార్ విధించారు.

భానుడి భగభగలకు ఉపగ్రహాలు బుగ్గి

అనూహ్యంగా కాలిపోయిన మూడు శాటిలైట్లు

ఊహించిన దాని కంటే ఎక్కువగా సోలార్ యాక్టివిటీ



పెర్త్: సోలార్ యాక్టివిటీ అధికమవుతున్నదని, ఫలితంగా దిగువ భూకక్ష్యలోని ఉపగ్రహాలకు ముప్పు పెరుగుతున్నదని ఆస్ట్రేలియా శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు. ఇక్కడి కర్టిన్ యూనివర్సిటీ నుంచి బినార్ స్పేస్ ప్రోగ్రామ్‌లో భాగంగా పంపిన బైనార్ 2, 3, 4 అనే మూడు చిన్న ఉపగ్రహాలు(క్యూబ్‌శాట్స్) గత వారం దిగువ భూకక్ష్యలో కాలిపోయాయి. ఇవి మూడు నెలలు పని చేసిన తర్వాత కాలిపోతాయని శాస్త్రవేత్తలు అంచనా వేయగా, రెండు నెలలకే దగ్ధమయ్యాయి. సోలార్ యాక్టివిటీ పెరగడమే ఇందుకు కారణమని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.

2026 నాటికి తగ్గే అవకాశం

భూమిపైకి సూర్యుడి నుంచి ప్రవహించే కణాలు(చార్జ్‌డ్ పార్టికల్స్) పెరగడాన్ని సోలార్ యాక్టివిటీ పెరిగిందని పేర్కొంటారు. ఈ చార్జ్‌డ్ పార్టికల్స్ ఉపగ్రహాల ఎలక్ట్రికల్ భాగాలను కాల్చేస్తాయి. ఇప్పుడు అధికంగా ఉన్న సోలార్ యాక్టివిటీ 2026 కల్లా తగ్గే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

గాలి కాలుష్యంతో పిల్లల్లో మందబుద్ధి

న్యూఢిల్లీ, నవంబర్ 12: గర్భధారణ సమయంలో, బాల్యం ప్రారంభంలో గాలి కాలుష్యానికి గురైతే, పిల్లలు ఆటిజం (మందబుద్ధి) బారినపడే ముప్పు ఉంటుందని తాజా అధ్యయనం హెచ్చరించింది. పీఎం 2.5 స్థాయి, నైట్రోజన్ ఆక్సైడ్‌లతో కూడిన సాధారణ గాలి కాలుష్యం పిల్లల్లో మెదడు ఎదుగుదలను తీవ్రంగా ప్రభావితం చేస్తుందని హిబ్రూ యూనివర్సిటీ ఆఫ్ జెరూసలేం పరిశోధకులు కనుగొన్నారు. 'జర్నల్ బ్రెయిన్ మెడిసిన్' నివేదిక ప్రకారం, ప్రస్తుత కాలంలో మానసిక ఎదుగుదల లోపం కారణంగా చాలా మంది పిల్లలు అనేక వ్యాధుల బారినపడుతున్నారు. అందులో 'ఆటిజం' అనే సమస్య కూడా ఒకటి.

సూర్యరశ్మిని నిలువరించి..!

- గ్లోబల్ వార్మింగ్ కట్టడికి వినూత్న ప్రయోగం
- 'సోలార్ జియోఇంజినీరింగ్' పేరిట ప్రాజెక్టు
- 6 విధాలుగా చేపట్టనున్న ప్రముఖ కంపెనీలు
- ఫండింగ్ ఇవ్వనున్న బిల్‌గేట్స్, ఓపెన్‌ఏఐ సీఈవో

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, నవంబర్ 12 (నమస్తే తెలంగాణ): భూతాపం కారణంగా జరుగుతున్న పర్యావరణ మార్పులతో అకాల వర్షాలు, కరువు-కాటకాలు, జీవ